

ఆకట్టుకున్న విద్యార్థినుల బంజార నృత్య ప్రదర్శన



జెండా వేడుకలకు హాజరైన జిల్లా అధికారులు



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు



గిరిజన వేషధారణలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

# అభివృద్ధి, సంక్షేమం

- సర్కారు బడుల్లో కార్పొరేట్ స్థాయి విద్య
- రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రీతమ్
- కలెక్టరేట్‌లో ఘనంగా 78వ స్వాతంత్ర్య వేడుకలు
- హాజరైన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

# ప్రగతి పథంలో వనపర్తి



కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రీతం, ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ గిరిధర్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



కలెక్టరేట్ వద్ద కవాత్ చేస్తున్న పోలీసులు



ప్రసంగిస్తున్న తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రీతం

వనపర్తి అర్బన్, ఆగస్టు 15: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో వనపర్తి జిల్లా ప్రగతి పథంలో ముందుకు సాగుతోందని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రీతమ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఎస్పీ రావుల గిరిధర్‌లతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిం చారు. జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్, ఎస్పీలతో కలిసి పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేసి, స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు. అనంతరం ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుకు సాగుతోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయడం ప్రారంభించిందని తెలిపారు. రాష్ట్రంలో ఆడపడుచులు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 81 లక్షల 48వేల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమి తిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నా మని తెలిపారు. ఈ పథకం వల్ల వనపర్తి జిల్లాలో 6,824 మంది పేదలు చికిత్స పొందినట్లు తెలిపారు. నిరుపేదల సొంత ఇంటి కల నిజం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావి స్తోందని, ఈ లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు పరుస్తోందని తెలిపారు. ఈ పథకం కింద ఈ ఏడాదిలోనే 4.50 లక్షల గృహాలు నిర్మించతల పెట్టనున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద ప్రతీ నియో జకవర్గంలో 3,500 గృహాలు నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. నానాటికీ పెరుగుతున్న ధరల ప్రభావం పేద ప్రజలపై పడరాదన్న సంకల్పంతో మహాలక్ష్మి పథకం కింద కేవలం రూ.500లకే వంట గ్యాస్ సరఫరా చేస్తున్నా మని తెలిపారు. ఈ పథకం కింద వనపర్తి జిల్లాలో 74,918 మందికి లబ్ధి పొందుతున్నారని అన్నారు.

దేశంలో ఎన్నడూ జరగని రీతిలో ఇచ్చిన హామీ మేరకు ఏక కాలంలో రూ.2 లక్షల వరకు రైతుల రుణమాఫీ చేసి రాష్ట్ర ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. జిల్లాలో రైతు రుణమాఫీ పథకం కింద మొత్తం 41వేల 780 మంది రైతన్నలకు రూ.28 కోట్ల 30 లక్షల 45వేల 345 రూపాయల రుణమాఫీ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద జిల్లాలో యాసంగి 2023-24 సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు రూ.180 కోట్ల 50 లక్షల 80వేల 540 రూపాయలు రైతుల ఖాతాలలో జమ చేశామని అన్నారు. రైతుబీమా పథకం ద్వారా బాధిత కుటుంబాలకు రూ.35 కోట్ల 30 లక్షలు నామిని ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.

రైతు సంక్షేమార్థమై జాతీయ సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్‌లో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం ద్వారా జిల్లాలో పండ్ల తోటల పెంపకాన్ని పెంచే దిశగా రూ. 38 లక్షల 10వేలు రాయితీ ఇచ్చామని తెలిపారు. 2024-25 సంవత్సరంలో ఆయిల్ పామ్ తోటలు సాగు చేసిన రైతులకు రెండో, మూడో సంవత్సరం అంతర పంటలు, ఎరువుల పెట్టుబడి కోసం 1,421 మంది రైతులకు రూ.1కోటి 93 లక్షల 57 వేలు రాయితీ కల్పించినట్లు వెల్లడించారు.

జిల్లాలో పరిశ్రమలు, వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా 33/11 కేవీ సామర్థ్యం గల 16 సబ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని అన్నారు. గృహ జ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు ఇప్పటి వరకు 73వేల 475 మందికి జీరో బిల్లులు జారీ చేయడం జరిగిందని అన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.18 లక్షల 94వేల 602లు సబ్సిడీ అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. జిల్లాలో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి 142 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలలో 13వేల 674 మంది మత్స్యకారులు సభ్యత్వం పొంది చేపలు అమ్ముతూ జీవనం పొందుతున్నట్లు తెలిపారు.

తెలంగాణ డయాగ్నోస్టిక్‌లలో భాగంగా మన జిల్లాలో తెలంగాణ డయాగ్నోస్టిక్‌ను ప్రారంభించి 52 రకాల రక్త పరీక్షలకు సీబీపీ, ఎల్ఎఫ్‌టీ, డెంగీ, మలేరియా మొదలైన పరీక్షలను ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. ఎంసీహెచ్ కిట్ కార్యక్రమం, ఎంసీహెచ్ న్యూట్రిషియన్ కిట్, స్టాఫ్ నర్సు నియామకాలు చేసినందుకు ప్రభుత్వ ఆసుపత్రులలో గర్భిణులకు, బాలింతలకు ప్రసవానంతర సేవలు మెరుగ్గా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జనవరి 2024 నుంచి జూలై 2024 వరకు 1.44లక్షల మంది ఓపీ సేవలు, 13,717 మందికి ఇన్ పేషెంట్ వైద్య సేవలు అందించామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ కూలీలకు రూ.48.10 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. వన మహోత్సవంలో భాగంగా 255 నర్సరీలలో 29 లక్షల 95వేల మొక్కలు పెంచామని తెలిపారు.

జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా పాఠశాలల అభివృద్ధి కోసం రూ.13 కోట్ల 18 లక్షల 57 వేలు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో జూన్ నెలలో జరిగిన బదిలీలలో జిల్లావ్యాప్తంగా 878 మంది ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా బదిలీ చేసి 438 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి, వారి దీర్ఘకాల సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరం నాటికి రాష్ట్రంలో అన్ని జిల్లాలో కంటే ప్రప్రథమంగా వనపర్తి జిల్లాలోనే మండలాలకు ఒకటి అర్బన్, రెసిడెన్షియల్, ఐదు ఇంగ్లిష్ మీడియం కస్తూర్బా విద్యాలయాలు ప్రారంభించినట్లు తెలిపారు.

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు తమ ఆటల ద్వారా అలరించారు. అనంతరం స్టాల్స్ పరిశీలించారు. అటవీ శాఖ, విద్యా, ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, ఉద్యాన శాఖ తదితర శాఖలు తాము చేపడుతున్న అభి వృద్ధి కార్యక్రమాలపై స్టాల్ ప్రదర్శించారు. జిల్లాలోని 1,042 గ్రామీణ మహిళా సంఘాల సభ్యులకు రూ.98.92 కోట్ల బ్యాంకు లింకేజీ వడ్డీ లేని రుణాల చెక్కును అందజేశారు. మెప్మా కింద 75 మహిళా సంఘాలకు రూ.7 కోట్ల 80 లక్షల 80వేల రూపాయల చెక్కును మహిళా సమాఖ్యకు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేష్, జిల్లా అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన



కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న ఉద్యోగులు, పోలీస్ శాఖ అధికారులు

## వేర్వేరు ప్రమాదాల్లో
# ఐదుగురు మృతి

- వారిలో ఉమ్మడి జిల్లాకు చెందిన వారు ముగ్గురు
- ఉండవల్లి వద్ద ఆటోను ఢీకొన్న కంటెయినర్
- హైదరాబాద్‌లో తుఫాన్‌ను ఢీకొన్న కారు





ఉండవల్లి మండలంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీదేవి, రమాదేవి, హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన తాజ్ పాషా(ఫైల్)

అలంపూర్ చౌరస్తా/ఆత్మకూరు, ఆగస్టు 15: జోగుళాంబ గద్వాల జిల్లా, హైదరాబాద్‌లో గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. వారిలో ఉమ్మడి జిల్లాకు చెందిన వారు ముగ్గురు ఉన్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై కూలీలతో వెళ్తున్న ఆటోను అతి వేగంతో వస్తున్న కంటైనర్ లారీ వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు ఆస్పత్రిలో మృతి చెందారు. 15 మంది గాయపడ్డారు. ఎస్ఐ శ్రీనివాస్ నాయక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా పేపర్ మిల్లు తాండ్రపాడు గ్రామానికి చెందిన 17 మంది మహిళా కూలీలు గురువారం ఉదయం అదే గ్రామానికి చెందిన ఆటోలో ఉండవెల్లి మండల పరిధిలోని కంచుపాడు గ్రామంలోని వ్యవసాయ పొలానికి కూలీ పనులకు బయలు దేరారు. 44వ జాతీయ రహదారిపై వరసిద్ధి వినాయక పత్తి మిల్లు సమీపంలో వీరు ప్రయాణిస్తున్న ఆటోను రాజస్థాన్‌కు చెందిన కంటైనర్ లారీ ఐరన్‌లోడ్‌తో హైదరాబాద్ వైపు వెళ్తూ వెనుకనుంచి ఢీకొట్టడంతో బోల్తాపడింది. ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న లక్ష్మీదేవి (56) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న హైవే, 108 సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ నరసింహులు, రమాదేవి, అనిత, ప్రియాంక, నందిని, రాధలతో పాటు మరో 11 మందిని కర్నూలు ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రమాదేవి(40) మృతి చెందింది. మరో ముగ్గురు ప్రియాంక, నరసింహులు, అనితల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడని, అతడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



ఉండవల్లి మండలం వరసిద్ధి వినాయక పత్తి మిల్లు వద్ద లారీ ఢీకొనడంతో బోల్తా పడ్డ ఆటో

### హైదరాబాద్‌లో జరిగిన ప్రమాదంలో..

ఆత్మకూరు: దైవ దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వనపర్తి జిల్లా ఆత్మకూరుకు చెందిన ఒకరు, కర్నూలు జిల్లాకు చెందిన అతని బంధువులు ఇద్దరు చనిపోయారు. బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని మందుల షాపులో పని చేసే రాజేష్ కుటుంబం, బంధువులతో కలిసి బుధవారం యాదగిరిగుట్టకు వెళ్లారు. తుఫాన్‌తో పాటు మరో ఎర్టిగా వాహనాన్ని అద్దెకు తీసుకుని 21 మంది దర్శనానికి బయల్దేరారు. దర్శనం చేసుకొని, రాత్రి అక్కడే ఉన్నారు. గురువారం ఉదయం సువర్ణగిరి పుణ్యక్షేత్రాన్ని సందర్శించి, ఆత్మకూరుకు బయల్దేరారు. మహిళలు తుఫాన్ వాహనంలో, పురుషులు ఎర్టిగాలో కూర్చున్నారు. పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద వెనుక నుంచి వచ్చిన కారు తుఫాన్ వాహనాన్ని ఢీకొంది. తుఫాన్ వాహనం పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న ఆత్మకూరుకు చెందిన తుఫాన్ యజమాని తాజ్ పాషా(36), రాజేష్ భార్య సోదరి వరలక్ష్మి(40), ఆమె మనువడు ఐదు నెలల బాలుడు అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన వారిలో మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన మరో ఎనిమిది మందిని శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తాజ్‌పాషాకు భార్య ఆసియా బేగం, ఇద్దరు కుమారులు ఉన్నారు. వరలక్ష్మి భర్త మృతి చెందడంతో ఆమె కుటుంబం కర్నూల్ పట్టణంలో నివాసం ఉంటోంది. రాజేష్ కోరిక మేరకు యాదగిరిగుట్టకు వెళ్లేందుకు ఆత్మకూరుకు వచ్చారు. సమాచారం తెలుసుకున్న రాజేష్ కుటుంబ సభ్యులు, తాజ్‌పాషా కుటుంబ సభ్యులు హైదరాబాద్ వెళ్లారు.



# విద్యార్థులకు బూట్లు తొడిగిన ఎమ్మెల్యే

- సొంత డబ్బులతో అందజేసిన అనిరుధ్‌రెడ్డి



బాదేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఓ విద్యార్థి కాలికి బూట్లు తొడిగి, లేస్ కడుతున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, ఆగస్టు 15: బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి గురువారం బూట్లు తొడిగారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు సొంత డబ్బుతో బూట్లు పంపిణీ చేస్తానని ఇచ్చిన హామీలో భాగంగా ఎమ్మెల్యే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బూట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి రూ.25 లక్షలు ఇవ్వాలని ప్రైవేటు పరిశ్రమల ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లానని, త్వరలోనే నిధులు ఇప్పిస్తానని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోని 27 వేల మంది విద్యార్థులకు బూట్లను ఇప్పిస్తానని హామీ ఇచ్చానని, ఇప్పటి వరకు సుమారు 15 వేల మంది విద్యార్థులకు పంపిణీ చేశానని చెప్పారు. రానున్న రెండు, మూడు రోజుల్లో మిగతావి పంపిణీ చేస్తానన్నారు. బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కొందరికి ఎమ్మెల్యే స్వయంగా బూట్లు తొడిగారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రాజకీయ పార్టీల నాయకులు, పాల్గొన్నారు.

# హెచ్‌సీఏ టోర్నీలో జిల్లా జట్టు సత్తాచాటాలి

- ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్
- అండర్-16 ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 15 : హెచ్‌సీఏ క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు సత్తా చాటాలని జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. నేటి నుంచి ఈనెల 24 వరకు హైదరాబాద్‌లో జరగనున్న హెచ్‌సీఏ అండర్-16 ఇంటర్ స్కూల్ కాలేజెస్ క్రికెట్ టోర్నీకి పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేశారు. గురువారం బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో జట్టు స భ్యులను అభినందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ప్రాబబుల్స్ జట్టు ఎంపిక చేసి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేశామని తెలిపారు. టోర్నీలో చక్కటి ప్రతిభ కనబరిచి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలన్నారు. హెచ్‌సీఏ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు అనేక విజయాలు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను జిల్లా క్రికెట్ సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎండీసీఏ శిక్షణ శిబిరాల్లో ఎంతో మంది ప్రతిభ గల క్రీడాకారులు వెలుగులోకి వచ్చారన్నారు. ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, కోచ్ సాయి పాల్గొన్నారు.



హెచ్‌సీఏ అండర్-16 టోర్నీకి ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు క్రీడాకారులు

### హెచ్‌సీఏ అండర్-16 టోర్నీకి ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు

అంకిత్‌రాయ్, బి.సాయిచరణ్, పి.రామ్‌కుమార్‌చారి, నవల్-ఉర్-రహెమాన్, స య్యద్ ఫైజన్, దక్ష పటేల్, అఖిల్, కె.భరత్, శ్రీహర్ష, డి.అభినవ్, కాన్షిక్‌గౌడ్, మణి చరణ్, అక్షయ్‌సాయి, అభినయ్‌తేజ, ప్రణవ్‌కుమార్ జట్టుకు ఎంపికయ్యారు.

## అదుపు తప్పి వాటర్ ట్యాంకర్ బోల్తా

ఊర్కొండ, ఆగస్టు 15: అదుపు తప్పి వాటర్ ట్యాంకర్ బోల్తా పడిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో గురువారం చోటుచేసుకుంది. బాధితుడు రాచాలపల్లి గ్రామానికి చెందిన చంద్రకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాచాలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కాల్య తండా నుంచి నీటి ట్యాంకర్‌ను తీసుకొని మండల కేంద్రానికి వస్తున్న క్రమంలో ఊర్కొండ శివారులో ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడిందని అన్నారు. దాంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదని తెలిపారు.

## కోళ్ల దాణా లారీ బోల్తా



రంగారెడ్డిపల్లి సమీపంలో బోల్తా పడిన లారీ

గండీడ్, ఆగస్టు 15 : కోళ్ల దాణా లారీ బోల్తా పడిన సంఘటన మండల పరిధిలోని రంగారెడ్డి పల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. డ్రైవర్ ఆకాష్, క్లీనర్ తెలిపిన వివరాలు ఉన్నాయి. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో నాందేడు నుంచి చెన్నైకి కోళ్ల దాణాను లారీలో తీసుకువెళ్తుండగా డ్రైవర్ నిద్రలోకి జారుకున్నాడు. దీంతో లారీ అదుపుతప్పి వరి పొలంలో బోల్తాపడింది. డ్రైవర్, క్లీనర్‌లకు ప్రమాదం తప్పింది.

## వ్యక్తి అదృశ్యం, కేసు నమోదు

కేటీదొడ్డి, ఆగస్టు 15 : జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం కొండాపురం గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తెలుగు తులసీరామ్ (50) ఈనెల ఆరో తేదీన తన పొలం నుంచి ఇంటికి వెళ్తున్నానని కుటుంబ సభ్యులతో చెప్పి వెళ్లాడు. నేటి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో గురువారం తులసీరామ్ కుమారుడు తెలుగు పరుశరాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# నమూనాల సేకరణ.. నామమాత్రమే

» విత్తనాలు, ఎరువుల నాణ్యతపై నిర్లక్ష్యం
» ఎరువుల్లో 250 శ్యాంపిల్స్‌కు తీసింది 45 మాత్రమే

పాలమూరు, ఆగస్టు 15 : ప్రభుత్వం రైతులకు మేలు చేయాలంటే మొదట చేయాల్సింది విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల్లో నకిలీని అరికట్టాలి. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సరైన సమయంలో రైతులకు అందిస్తే దిగుబడి మంచిగా సాధించి రైతులకు మేలు చేకూరుతుంది. దానికోసం వ్యవసాయ శాఖ చేయవలసిందంతా ఆయా విత్తనాలు, ఎరువులు, పురుగు మం దుల నమూనాలు సేకరించి నాణ్యమైన వాటిని గుర్తించి రైతులను అప్రమత్తం చేయాలి. నేడు ఖరీఫ్ సీజన్ సగం దాటిపోతున్నా వ్యవసాయశాఖ ఆ వైపు అడుగులు వేయ లేదు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల్లో నకిలీని గుర్తుపట్టే ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ ఏడాది లక్ష్యంలో సుమారు 50శాతం నేటికీ పూర్తి చేయకపోవటమే దానికి నిదర్శనం. ఎరువుల్లో ఏడాదికి 250 నమూనాలను మే, జూన్, జూలై వరకు 82 తీయాల్సి ఉండగా 68 మాత్రమే తీశారు. విత్తనాలు సుమారు 280కు 76తీ యాల్సి ఉండగా కేవలం 68 మాత్రమే తీశారు. పురుగు మందులు ఏడాదికి 73 లక్ష్యం ఉంటే అందులో ఇప్పటి వరకు 22 తీయాల్సి ఉంది, 15 మాత్రమే సేకరించారు. బహిరంగ మార్కెట్‌లో రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యమైనవో, నకిలీవో తేలాలంటే నమూనాల సేకరణ అధికంగా జరగాలి. అది వ్యాపారస్థలంలోనే జరగాలి. గతంలో సుమారు 400 నమూనాలు సేకరించి ల్యాబ్‌కు ఏవోలు పంపితే అందులో 40శాతం శ్యాంపిల్స్ విఫలమ వటంతో కొంతమందిపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపారు. భూత్పూర్ మండలంలో గతేడాది 66 శ్యాంపిల్స్ తీయగా 12 విఫలమయ్యాయి. ఈ ఏడాది 66 నమూనాలకు ఇప్పటికీ 44 తీయగా అందులో ఆరు విఫలమయ్యాయి

### నమూనాలు ఎంత ఎక్కువ తీస్తే అంత మంచింది

రైతులకు మేలు జరగాలంటే విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నమూనాలు అధికంగా సేకరించి ల్యాబ్‌కు పంపాలని నిపుణులు చెబుతున్నారు. దానివల్ల నకిలీలను అరికట్టే అవకాశం ఎక్కువ ఉంటుందంటున్నారు. అసలు నమూనాలు తీయకపోవటం నకిలీలు అమ్మే వారికి తోడ్పడటమేనని చెబుతున్నారు. ఎరువుల్లోని మైక్రో న్యూట్రేట్స్, మ్యాక్రోన్యూట్రేట్స్‌లో నమూనాలు సేకరించాలి. మిక్సర్ ఫర్టిలైజర్స్‌గా పేర్కొనే ఎరువుల్లో ఎక్కువ నకిలీలు వచ్చే అవకాశం ఉన్నందున వాటిల్లో సుమారు 90శాతం నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపాలి. గతంలో మైక్రో న్యూట్రేట్స్, మ్యాక్రోన్యూట్రేట్స్ నమూనాల్లో కొన్ని విఫలమైనట్లు తెలుస్తోంది. ఇప్పుడు అసలు ఆ నమూనాల జోలికి అధికారులు వెళ్లలేదని తెలుస్తోంది.


జడ్చర్లలో పట్టుబడిన నకిలీ విత్తనాలను ప్రదర్శిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

### విత్తనాల్లో ఫెయిల్యూర్ ఎక్కువ

గత ఏడాది విత్తనాలకు సంబంధించిన వందశాతం శ్యాంపిల్స్ తీస్తే అందులో అనేకం విఫలమయ్యాయి. జడ్చర్ల-2, భూత్పూర్-12, దేవరకద్ర-2 విత్తన కంపెనీకి చెందిన మిర్చి, మరో రెండు కంపెనీల పత్తి విత్తనాలు విఫలమయ్యాయి. పురుగు మందుల నమూనాలు గత ఏడాది 73కు మొత్తం తీశారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల శ్యాంపిల్స్ తీసే విషయంలో అధికారుల్లో నిర్లక్ష్యం కొరవడినట్లు కనిపిస్తోంది. ఇప్పటికైనా నమూనాలు సేకరిస్తే రాబోవు రోజుల్లో రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది.

## కణతి మాంసం పట్టివేత

» ముగ్గురి రిమాండ్


పట్టుబడిన ముగ్గురు నిందితులు

అమ్రాబాద్, ఆగస్టు 15 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వంగురోనిపల్లి గ్రామంలో విద్యుత్ తీగలు అమర్చి కణతిని చంపిన సంఘటనలో ముగ్గురు వ్యక్తులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అమ్రాబాద్ అటవీ అధికారి గురుమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వంగరోనిపల్లి గ్రామానికి చెందిన పిల్లి సాయిలు, జక్కా నరసింహారావు, కడారి అంజయ్య 12వ తేదీ రాత్రి గ్రామ సమీపంలోని అడవిలో విద్యుత్ తీగల ద్వారా కణతిని చంపి, దాని మాంసాన్ని విక్రయించడానికి ప్రయత్నం చేస్తున్న సమయంలో అటవీ అధికారుల బృందం వెళ్లి పట్టుకున్నట్లు ఆయన ఈ ప్రకటనలో పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి విచారణ అనంతరం కల్వకుర్తి సబ్ జైలుకు బుధవారం రాత్రి తరలించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి డిప్యూటీ రేంజ్ అధికారి వాణి కుమారి, ఖాజా మైనుద్దీన్, నాగేశం, శారద తత్ర అధికారులును రేంజ్ అధికారి గురుమూర్తి అభినందించినట్లు ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇసుక ట్రాలీ పట్టివేత


పట్టుబడిన ఇసుక ట్రాలీ ఆటో

కోయిలకొండ, ఆగస్టు 15 : మండలంలోని పెద్దవాగు నుంచి అనుమతులు లేకుండా ట్రాలీ ఆటోలో తరలిస్తున్న ఇసుక ట్రాలీని గురువారం పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొన్ని రోజుల నుంచి రాత్రి, పగలు తేడాలేకుండా ఇసుక తరలింపుపై ఫిర్యాదు రావడంతో పోలీసుల దాడులు నిర్వహించి స్టేషన్‌కు తరలించారు.

## శవాన్ని పూడ్చనీయడం లేదు

» కలెక్టరేట్ ముందు ధర్నా » ఎస్సై కులం పేరుతో దూషిస్తున్నాడని ఆందోళన
» సీఐ హామీతో ధర్నా విరమించిన గ్రామస్థులు

గద్వాల క్రైం, ఆగస్టు 15 : తమ గ్రామంలో ఉన్న వ్యక్తి మృతి చెందితే ఆ కులానికి చెందిన వ్యక్తి పూడ్చనీయడం లేదని గ్రామస్థులు ఆందోళన చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన గ్రామస్థులపై కేటీ దొడ్డి ఎస్సై కులం పేరుతో దూషిస్తూ అవతలి వ్యక్తులకు వత్తాసు పలుకుతున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తూ జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు గురువారం ఇర్కిచేడు తండావాసులు ధర్నా నిర్వహించారు. గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలోని కేటీ దొడ్డి మండలం ఇర్కిచేడు తండాకు చెందిన గోర్యానాయక్(70) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని పూడ్చేందుకు శ్మశానవాటికలో గుంత తవ్వించి గురువారం అంత్యక్రియలు నిర్వహించేందుకు గ్రామస్థులు వెళ్లగా శ్మశానవాటికకు పక్కన పొలం ఉన్న గోబ్ర్యానాయక్ అనే వ్యక్తి అడ్డుకున్నాడు. దీంతో గ్రామస్థులందరూ కేటీదొడ్డి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఎస్సైకి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా తాము చెప్పేది ఏమీ వినకుండా గోబ్ర్యానాయక్‌ను పోలీస్‌స్టేషన్‌లో ఉండి తమపై దుర్భాషలాడుతూ కులం పేరుతో దూషించారన్నారు. తమపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తుండటంతో శవాన్ని అలాగే ఉంచి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు ధర్నా చేసేందుకు వచ్చామన్నారు. ఎవరైనా చనిపోతే కొన్ని సంవత్సరాల నుంచి అక్కడే పూడ్చుతున్నామని, కావాలంటే అధికారులు వచ్చి పరిశీలించుకోవాలని సూచించారు. కానీ ఇవేమీ వినకుండా ఎస్సై శ్రీనివాస్ తమపై దురుసుగా ప్రవర్తిస్తూ దాడికి యత్నిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ దాదాపు గంటకు పైగానే కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న సీఐ భీంకుమార్, పట్టణ ఎస్సై శ్రీనివాస్ గ్రామస్థులకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. చివరకు సీఐ భీంకుమార్ శుక్రవారం ఇర్కిచేడు గ్రామానికి వచ్చి శ్మశానవాటికకు సంబంధించిన స్థలంపై పూర్తి స్థాయిలో సర్వే, విచారణ చేయిం చి ఇక ఈ సమస్య మీకు తలెత్తకుండా చేస్తానని, ఇప్పుడు వెళ్లి అంత్యక్రియలు చేయాలని, నేను హామీగా ఉంటానని చెప్పడంతో గ్రామస్థులు శాంతించి, ధర్నా విరమించారు.

ఈ విషయంపై కేటీ దొడ్డి ఎస్సై శ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా శవానికి మొదట అంత్యక్రియలు చేయాలని చెప్పానని, మిగతా విషయాలపై కూడా ఈ స్థలంపై సర్వే చేయిస్తానని చెప్పానని, కులం పేరుతో ఎవరినీ దూషించలేదని కానీ ఇవేమి వారు వినకుండా ధర్నా చేసేందుకు వెళ్లారని వివరణ ఇచ్చారు.


కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఇర్కిచేడు గ్రామస్థులు

## 300 మీటర్ల జెండాతో ర్యాలీ

అచ్చంపేట టౌన్, ఆగస్టు 5 : స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని అచ్చంపేట నియోజకవర్గంలో వాడవాడలా గురువారం మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఈ సందర్భంగా పట్టణంలో 300 మీటర్ల జెండాతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు. గురుకుల పాఠశాలతో పాటు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


300 మీటర్ల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

## వ్యక్తిపై దాడి : కేసు నమోదు

వడ్డేపల్లి, ఆగస్టు 15 : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం జక్కిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి రాఘవేంద్రపై గురువారం జరిగింది. ఈ దాడికి కారణమైన రంగస్వామి, ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై అయ్యన్న తెలిపారు. పొలం విషయంలో గొడవ పడి రాఘవేంద్రపై వారు దాడి చేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

## హత్య కేసులో నిందితుడికి రిమాండ్

ఎర్రవల్లి, అగస్టు 15 : జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం మునుగాల గ్రామంలో చోటు చేసుకున్న బాలుడి దారుణ హత్య కేసులో నిందితుడిని అలంపూర్ కోర్టులో హాజరుపరిచి మహబూబ్‌నగర్ జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఏడు సంవత్సరాల బాలుడు రఫీని తన మేనత్త భర్త మౌలాలి బాలుడి తల్లితో పెట్టుకున్న వివాహేతర సంబంధమే హత్యకు గల ప్రధాన కారణమని వివరించారు.

## గుర్తు తెలియని శవం లభ్యం

కొల్లాపూర్, ఆగస్టు 15 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల కేంద్రంలోని గుండ్లచెరవులో గురువారం గుర్తు తెలియని శవం లభ్యమైంది. కొల్లాపూర్ ఎస్ఐ రుషికేష్ తెలిపిన వివరాల ప్రకారం..కొల్లాపూర్ పట్టణంలోని గుండ్ల చెరువులో 35 నుంచి 40సంవత్సరాల మధ్య వయస్సు గల యువకుడి శవం లభ్యమైందన్నారు. మృతదేహం కుడిచేతి మీద శివనీల అని పచ్చబొట్టు రాసి ఉందని కుడిచేతికి కడెం కూడా ఉందని గుండ్ల చెరువు ఒడ్డు మీద నల్లపు రంగు షార్టు, బూడిదరంగు ఫుల్ టీషర్టు, గోధుమ కలర్ జీన్స్‌పాయింట్, ఫోన్ బుక్కు, సున్నం డబ్బా ఉన్నాయని వివరించారు. సంబంధించిన బంధువులు ఆచూకీ తెలిపిన వారు కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ రుషికేష్ పేర్కొన్నారు.

## ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

అయిజ, ఆగస్టు 15 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణం కర్నూల్ టీ రోడ్డు సమీపంలో ఉరి వేసుకొని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై విజయ్‌భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన బోయ పెద్ద రాముడుకు 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానంగా ఓ కూతురు ఉంది. మొదటి భార్య అనారోగ్యం కారణంగా రాముడు ఏపీలోని కర్నూల్ జిల్లా పెద్దకడుమూరుకు చెందిన రాధ(22)ను ఆరు నెలల క్రితం రెండవ వివాహం చేసుకున్నాడు. ఇదే క్రమంలో గది అద్దెకు తీసుకుని ఆమెతో వేరుగా కాపురం పెట్టారు. ఈనెల 14వ తేదీ బుధవారం రాత్రి భర్త ఇంట్లో లేని సమయంలో రాధ చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు కిటికీ ఊచలు తొలగించి ఆమెను కిందకు దించగా అప్పటికే మృతి చెందింది. మృతురాలి తండ్రి లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వివాహిత ఆత్మహత్య..


వడ్ల సత్యమ్మ (ఫైల్)

వడ్డేపల్లి, ఆగస్టు 15 : ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని పైపాడు గ్రామంలో చోటు చేసుకుంది. శాంతినగర్ ఏఎస్సై అయ్యన్న తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల సత్యమ్మ(36) రెండు రోజుల క్రితం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హాస్టల్‌లో చదువుకుంటున్న మృతురాలి పిల్లలు గురువారం ఇంటికి వచ్చి చూడగా తల్లి ఉరి వేసుకొని కన్పించడంతో సమీప బంధువులకు తెలిపారు. సత్యమ్మ ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని మృతురాలి తండ్రి కృష్ణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## మనస్తాపంతో యువకుడు..


శ్రీకాంత్ (ఫైల్)

బిజినేపల్లి, ఆగస్టు 15 : కొంతకాలంగా మనస్తాపంతో బాధపడుతున్న శ్రీకాంత్(23) అనే యువకుడు బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి గురువారం తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఖానాపూర్ గ్రామంలో పదేళ్లుగా శ్రీకాంత్ అక్క లీలావతి, బావ సుధాకర్ వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. తల్లిదండ్రులు పదేళ్ల క్రితం చనిపోవడంతో సొంత గ్రామం తాడూరు నుంచి ఖానాపూర్ గ్రామంలోని అక్క బావల వద్ద ఉంటున్నాడు. కొంతకాలంగా మనస్తాపంగా ఉన్న అతడు ఫారంలోని కోళ్లకు నీళ్లు పెడుతానని వెళ్లి షెడ్‌లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు ఒడిగట్టాడని తెలిపారు. మృతుడి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### మానసిక స్థితి బాగాలేక మహిళ..

మూడేళ్ల క్రితం భర్త చనిపోయి మానసిక స్థితి బాగాలేక ఇంట్లో ఉరేసుకొని మహేశ్వరి(33) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మమ్మాయిపల్లి గ్రామానికి చెందిన మృతురాలు భర్త చనిపోవడంతో ఇద్దరు పిల్లలతో కలిసి మూడేళ్లుగా తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో పాటు భర్త చనిపోయిన వేదన ఒంటరిగా ఉండలేక ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. తల్లి బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రైతు డబ్బులు మాయం

» ఆందోళనలో మహిళ


మహిళా రైతు తిములమ్మ

గద్వాల, ఆగస్టు 15 : ర్యాలంపాడు రిజర్వాయర్‌లో ముంపునకు గురైన తన పొలం, ఇంటికి పరిహారం అందించాలంటూ జోగుళాంబ గద్వాల జిల్లా ఆలూరు గ్రామానికి చెందిన తిమ్ములమ్మ అనే మహిళ ఈనెల 13వ తేదీన ఆర్డీవో కార్యాలయానికి వచ్చింది. దీంతో కార్యాలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే కార్యాలయానికి చేరుకున్న పోలీసులు ఆమెను బలవంతంగా బయటకు తీసుకపోయారు. ఈ క్రమంలో పెనుగులాట జరగడంతో తన వెంట ఉన్న రూ.50 వేలు పడిపోయాయని ఆమె వాపోయింది. తాను అప్పు ఇచ్చిన వ్యక్తి తనకు తిరిగి అప్పు కట్టగా దానిని బ్యాంకులో వేయడానికి వెంటే తెచ్చుకున్నానని వివరించింది. పోలీసులు బలవంతంగా వాహనంలో ఎక్కించడం, కొత్త బస్టాండ్ వద్ద తనను బయటకు తోసేయడంతో డబ్బు లు మాయమయ్యాయని ఆరోపించింది. మరుసటి రోజు డీఎస్పీని ఆశ్ర యిస్తే పట్టణ పోలీస్‌స్టేషన్‌కు పంపించారని అక్కడ ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. తన డబ్బులు మాయం కావడానికి అధికారులతో పాటు, పోలీసులే బాధ్యులని విలేకరులకు వివరించింది. ఆర్డీవో కార్యాలయ ఆవరణలో సీసీ కెమరాలు ఉన్నాయి. పోలీసులు విచారణ చేస్తే మహిళా రైతుకు న్యాయం జరిగే అవకాశం ఉంది.

## రాష్ట్రపతి సేవా పతకానికి ఇటిక్యాల ఏఎస్సై ఎంపిక


ఏఎస్సై వెంకటేశ్వర్లు

ఇటిక్యాల, ఆగస్టు 15 : రాష్ట్రపతి సేవా పతకానికి జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల ఏఎస్సై వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. తన పదవీ కాలంలో చేసిన సేవలకు గాను గుర్తింపు సేవా పతకానికి ఆయన ఎంపికయ్యారు. 1989లో పోలీసు ఉద్యోగంలో చేరి కరీంనగర్ జిల్లాలో పనిచేసిన అనంతరం బదిలీపై అలంపూర్ నియోజకవర్గంలోని రాజోలికి వచ్చారు. అనంతరం అంచెలంచెలుగా ఎదుగుతూ మిడ్జిల్‌లో పనిచేస్తూ ఏ ఎస్సైగా పదోన్నతి పొంది 2020లో ఇటిక్యాలకు పదోన్నతిపై వచ్చారు. తన సుదీర్ఘ కాలంలో చేసిన సేవలకు గాను రాష్ట్రపతి పతకానికి ఎంపిక కావడం సంతోషదాయకమన్నారు. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా పోరుమామిళ్ల గ్రామం. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన వెంక టేశ్వర్లు పట్టుదలతో పోలీసు ఉద్యోగాన్ని సాధించారు.

## వైభవంగా పవిత్రోత్సవాలు



వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న పూజారులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 15 : జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం అగ్ని ప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అయ్యలూరి రఘునాథాచార్యులు తెలిపారు. అనంతరం పవిత్ర మాలలను స్వామి వారికి అమ్మ వార్లకు, పరివార దేవతలకు, ఆళ్వార్‌లకు, ఆచార్యులకు, దేవాలయ గోపురాలకు అలంకరణ చేసినట్లు వివరించారు. సాయంత్రం హోమశాలలలో హోమం నిర్వహించామని శుక్రవారం కూడా ఉదయం, సాయంత్రం హోమ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. శనివారం యాగశాలలో మహా పూర్ణాహుతి, పవిత్రమాలను తొలగించి స్వామి వారికి అమ్మ వార్లకు 108 కలశాలతో అభిషేకం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు, సాయంత్రం 7 గంటలకు లక్ష్మీ నరసింహస్వామి కుంకుమార్చాన కార్యక్రమాలు ఉంటాయని సూచించారు. కార్యక్రమంలో ధరాచార్యుల బృందం, ప్రధాన అర్చకులు ప్రవీణ్ కుమార్ ఆచార్యులు, గురు ప్రసాద్ ఆచార్యులు, భరణి కుమారు ఆచార్యులు, రామచంద్రాచార్యులు, లక్ష్మీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఖిల్లాఘణపురం, ఆగస్టు 15: మండల కేంద్రం నుంచి షాపూర్ గ్రామం వరకు ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంతలు పడడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలోని షాపూర్ గ్రామ శివారులో ప్రధాన రహదారిపై గుంతలు ఉండడంతో గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో వాహనదారుడు మల్లేష్‌కు కాలు విరిగింది. జడ్చర్ల మండలం నెక్కొండ గ్రామానికి చెందిన మల్లేష్ కూతురు సృజన ఖిల్లాఘణపురం మండలం దొంతికుంట తండా మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. తన కూతురును రాఖీ పౌర్ణమి పండుగకు స్వగ్రామానికి తీసుకువెళ్లడానికి వస్తుండగా షాపూర్ గ్రామ శివారులో ప్రమాదం జరిగినట్లు బాధితుడు వాపోయారు. మల్లేష్ ఖిల్లాఘణపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రోడ్డుపై గుంతలు ఉండడంతో తరచుగా ప్రమాదాలు గురవుతున్నా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించడం లేదని మండల ప్రజలు వాపోయారు.

## సైబర్ నేరాలపై అవగాహన

శ్రీరంగాపురం, ఆగస్టు 15: మండల కేంద్రమైన శ్రీరంగాపురం అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం సైబర్ నేరాలపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. దీంతో పాటు మోటార్ సైకిల్‌కు నెంబరు ప్లేట్ లేకుంటే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ యువకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు పనులను పరిశీలించిన మునిసిపల్ చైర్‌పర్సన్



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్

పెబ్బేరు, ఆగస్టు 15: పెబ్బేరు పట్టణ సమీపంలో అంబేడ్కర్‌నగర్ వద్ద జరుగుతున్న బీటీ రోడ్డు పనులను గురువారం మునిసిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామిలు పరిశీలించారు. రోడ్డు వెడల్పులో భాగంగా కొంత దూరం వదిలిపెట్టిన పనులను వారు పరిశీలించారు. నాణ్యవంతంగా రోడ్డు వేయాలని గుత్తేదారులకు సూచించారు. సంస్కృతి పెట్రోల్ పంప్ నుండి జూరాల కాలువ వరకు బీటీ రోడ్డు పనులను గుత్తేదారు పూర్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపిబాబు, చిన్న ఎల్లారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

## ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ల పంపిణీ

కొత్తకోట, ఆగస్టు 15 : మండలంలోని కనిమెట్ట గ్రామ మాజీ సర్పంచ్ గాదంరాణి ద్విచక్రవాహనదారులకు గురువారం హెల్మెట్లు పంపిణీ చేశారు. ఇటీవలి కాలంలో గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు హెల్మెట్ ధరించక పోవడంతోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మరోసారి అలా జరగొద్దని హెల్మెట్లు పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. హెల్మెట్ ధరించి వాహనం నడపాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లక్ష్మయ్య మాజీ సర్పంచ్ బాలయ్య, పరమేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## అమరచింత బంద్‌ను జయప్రదం చేయండి

అమరచింత, ఆగస్టు 15: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా శుక్రవారం అమరచింత బంద్‌కు హిందూ ఐక్యవేదిక, బజరంగ్ దళ్ నాయకులు మేర్వ రాజు, టౌన్ అధ్యక్షులు క్యామ భాస్కర్, మేర్వ అనిల్, విజయ యాదవ్, విష్ణు లు పిలుపునిచ్చారు. గురువారం అమరచింతలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ప్రతీ ఒక్కరు ఖండించాలని వారు కోరారు. అమరచింత బంద్‌లో వ్యాపారస్తులు, విద్యా సంస్థలు సహకరించి బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధికి దరఖాస్తు చేసుకోండి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 15: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారిని నుషిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా విదేశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ చదివే షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందజేస్తుందన్నారు. విద్యార్థులు ఈనెల 14వ తేదీ నుంచి అక్టోబరు 13వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట, ఆగస్టు 15 : మండలంలోని అప్పరాల గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు చంద్రన్న అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. చంద్రన్న కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు విశ్వేశ్వర్, వామన్‌గౌడ్, చెన్నకేశవరెడ్డి, శంకర్, ప్రశాంత్, నాగవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



ఎమ్మెల్యే మేఘారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మానాజీపేట బీఆర్ఎస్ పార్టీ నాయకులు

ఖిల్లాఘణపురం, ఆగస్టు 15: మండలంలో అనారోగ్యానికి గురై ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న 41 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. మండలంలోని మానాజీపేట, ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని లబ్ధిదారులకు గ్రామాల్లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి నిరుపేద కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురైతే కార్పొరేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ నిరుపేద కుటుంబానికి కార్పొరేట్ వైద్యం అందించడానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మానాజీపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన వెంకటనారాయణ రెడ్డి, కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, బలరాం , చౌడయ్య, శరవంద లతో పాటు మరో 20 మందికి కండువాలను కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మురళీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సాయిచరణ్ రెడ్డి, వెంకటేశ్వరరావు, గంజాయి రమేష్, రాములు నాయక్, కృష్ణయ్య యాదవ్, సతీష్, ప్రకాష్, రవి నాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఎకరాకు సాగునీరు



భూత్పూర్ రిజర్వాయర్ కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అమరచింత, ఆగస్టు 15: ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా తాము ముందుకు వెళ్తున్నట్లు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. గురువారం అమరచింత మండలం పామిరెడ్డిపల్లి గ్రామ శివారులో భూత్పూర్ రిజర్వాయర్ కాలువ ద్వారా అమరచింత పెద్ద చెరువుకు వస్తున్న నీటిని దేశాయి ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ కల్లు గీత విభాగం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, అమ్మాపురం సంస్థానాదీశులు శ్రీరాం భూపాల్ తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గ రైతులు సాగునీటి విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రతీ చెరువును నీటితో నింపి ప్రతీ ఎకరాకు నీరు అందిస్తామని అన్నారు. భూత్పూర్ రిజర్వాయర్ నుంచి 26 కిలో మీటర్లు ప్రయాణించి అమరచింత పెద్ద చెరువుకు సాగు నీరు రావడం సంతోషకర విషయం అని అన్నారు. ఆత్మకూరు మండలం పిన్నంచర్ల చెరువు వరకు నీటిని ఎలాంటి అవాంతరాలు లేకుండా వేగంగా వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు కాలువ వద్ద తమకు నీరు అందవు అనే అభద్రత బావంతో భూత్పూర్ కాల్వ గేట్లను విరగొట్టి కాలువలో మట్టిని, ఇసుక దిబ్బలను అడ్డు వేసి దిగువన ఉన్న రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని ఆయన కోరారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు రైతు సమస్యలపై అవగాహన ఉందని అన్నారు. సాగునీటిని మరింత సమృద్ధిగా అందించే లక్ష్యంతో ఈ నెల 31న రైతులతో సమావేశమై సాగునీటి సమస్యపై చర్చిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాగరాజుగౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్, తులసిరాజ్, మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, రహమతుల్లా, పరమేష్, శ్రీను, విష్ణు, శ్యామ్, ప్రకాష్, మార్క వెంకటయ్య, బీసీ రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, మహమ్మద్ కౌసర్, హరీశ్ తదితరులు ఉన్నారు.



పోలీస్ కార్యాలయంపై జెండాను ఎగురవేస్తున్న ఎస్పీ గిరిధర్



టీడీపీ కార్యాలయం వద్ద జెండా పండుగలో పార్టీ నాయకులు



జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

## మువ్వన్నెల రెపరెపలు

- ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- జాతీయ జెండాను ఎగరవేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు



బీజేపీ కార్యాలయంపై జెండాను ఎగరవేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ

వనపర్తిఅర్బన్/ వనపర్తి రాజీవ్‌చౌరస్తా/ వనపర్తి టౌన్/ఖిల్లాఘణపురం/పెబ్బేరు/వనపర్తి రూరల్/ వీపనగండ్ల/పాన్‌గల్/శ్రీరంగాపురం/పెబ్బేరు రూరల్ /చిన్నంబావి/పెద్దమందడి/కొత్తకోట/ఆత్మకూరు/ అమరచింత, ఆగస్టు 15 : వనపర్తి జిల్లా వ్యాప్తంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పార్టీ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉద్యోగులు ప్రజాప్రతినిధులు జాతీయ గీతాలాపన చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంతో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి జాతీయ జెండాను ఎగరవేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్ జాతీయ జెండా ఎగరవేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. జిల్లా ప్రజలందరికీ 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని బీజేపీ, టీడీపీ, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మునిసిపల్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా కార్యాలయాల వద్ద పార్టీ జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉన్నతాధికారులు జెండా ఎగురవేశారు. జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఖిల్లాఘణపురం మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలపై గురువారం మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పాండు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో రాజు, పోలీస్ స్టేషన్‌లో ఇన్‌చార్జి ఎస్ఐ రామకృష్ణ జెండా ఆవిష్కరించారు. రేవల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీదేవి జెండావిష్కరించారు. తలుపునూరులో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. గోపాల్‌పేట తహసీల్దార్ కార్యాలయం ముందు తహసీల్దార్ తిలక్‌కుమార్ రెడ్డి, ఎంపీడీవో కార్యాలయం ముందు ఎంపీడీవో శంకర్, పోలీస్ స్టేషన్ ముందు ఎస్సై హరిప్రసాద్ త్రివర్ణ పతాకన్ని ఎగురవేశారు. పెబ్బేరు మునిసిపల్ కార్యాలయంపై చైర్‌పర్సన్ కరుణశ్రీ, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో కార్యాలయంలో కోదండరాంరెడ్డి జెండా ఎగురవేశారు. వీపనగండ్ల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ కృష్ణమూర్తి జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. పాన్‌గల్ మండల పరిషత్ కార్యాలయంపై ఎంపీడీవో గోవిందరావు, తహసీల్దార్ కార్యాలయంపై తహసీల్దార్ సుబాష్ నాయుడు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పై పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిలు జాతీయ జెండాను ఎగరవేశారు. శ్రీరంగాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ మురళీ, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఇన్‌చార్జి పీడీవో రవీంద్ర జెండా ఆవిష్కరణ చేశారు. పెద్దమందడి మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, స్వచ్ఛంధ సంస్థల కార్యాలయాల ఎంపీడీవో సద్గుణ, ఎంఈవో జయశంకర్, తహసీల్దార్ చక్రపాణి జెండావిష్కరణ చేశారు.

కొత్తకోట మునిసిపల్ కార్యాలయంపై చైర్‌పర్సన్ సుకేశిని పోలీస్, ఎక్సైజ్ ఆఫీస్‌లపై సీఐలు రాంబాబు, కరుణ, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల పై తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో రవీంద్ర బాబు జాతీయ జెండాను ఎగుర వేశారు. పాఠశాల విద్యార్థుల ర్యాలీలు నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు, తహసీల్దార్, మండల పరిషత్, మండల మహిళా సమాఖ్య, వ్యవసాయ, మునిసిపల్, పోలీస్ స్టేషన్, ఫైర్ స్టేషన్ వంటి ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలో పాఠశాలలో సంబంధిత అధికారులు జాతీయ జెండాను ఎగరవేసి 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అమరచింత తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో తహసీల్దార్ రమేష్ రెడ్డి, మునిసిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ మంగమ్మ, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు, బీజేపీ జెండా కట్ట వద్ద పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్ జాతీయ జెండాను ఎగరవేశారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రభాతభేరి నిర్వహించి జాతీయ నాయకులను స్మరించుకున్నారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు.

కార్యక్రమంలో తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, మునిసిపల్ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, ఎస్ఐలు, సీఐలు, వైద్యాధికారులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చందర్, మునిసిపల్ చైర్మన్ పుట్ట పాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, ప్రముఖ వైద్యుడు డాక్టర్ పగిడాల శ్రీనివాస్, ఎస్ఎల్ఎన్ రమేష్, కౌన్సిలర్లు బాపనిపల్లి వెంకటేష్, విభూది నారాయణ, చీర్ల సత్యంసాగర్, నందిమల్ల భువనేశ్వరి, జయసుధ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, ఎస్పీ అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఏఆర్ సీఐలు, ఎస్ఐలు,టీడీపీ నాయకు లు బొలమోని రాములు, వెంకటయ్య యాదవ్, సుధాకర్ నాయుడు, దస్తగిరి, సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు, ఆర్ఎంవో డాక్టర్ బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు మునిసిపల్ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగురవేస్తున్న చైర్ పర్సన్



పెబ్బేరు మునిసిపాలిటీ వద్ద జెండా పండుగలో చైర్‌పర్సన్



వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో వద్ద సమరయోధుల కుటుంబాలతో పోలీసులు

## యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో పాల్గొనాలి

- రాష్ట్ర కాంగ్రెస్ కల్లు విభాగం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు గౌడ్

అమరచింత, ఆగస్టు 15: యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు పాల్గొని ఆన్‌లైన్ ఓటింగ్ వేయాలని రాష్ట్ర కాంగ్రెస్ కల్లుగీత విభాగం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ అన్నారు. గురువారం అమరచింతలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అగ్రనేత రాహుల్ గాంధీ సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సూచన మేరకు ఎన్నికలు పారదర్శకంగా జరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికే మండలంలో మీట్టనందిమల్ల గ్రామానికి చెందిన శరత్ కుమార్ రెడ్డి, అమరచింతకు చెందిన రాకేష్ గౌడ్, పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తిరుమల్ రెడ్డి లు పోటీలో ఉన్నారని ఆయన చెప్పారు. పోటీలో ఉన్న వారి మధ్య ఏకాభిప్రాయం కుదిరి శరత్ కుమార్ రెడ్డికి మద్దతు ఇచ్చినప్పటికీ మిగతా ఇద్దరికీ పార్టీ సముచిత స్థానం ఇస్తుందని అన్నారు. క్రమశిక్షణతో కూడిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిష్టాన ఆదేశాలను ప్రతీ ఒక్కరు పాటించాలని ఆయన కోరారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కృషి చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, యూత్ నాయకులు శరత్ కుమార్ రెడ్డి, రాకేష్ గౌడ్, నాయకులు విష్ణు, హనుమంత్ నాయక్, తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు డిగ్రీ కళాశాల విద్యార్థికి రాష్ట్రస్థాయి 53వ ర్యాంకు

ఆత్మకూరు, ఆగస్టు15: సీపీజీఈటీ ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో ఆత్మకూరు డిగ్రీ కళాశాల విద్యార్థిని మంజుల 53వ ర్యాంకు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ తెలిపారు. ఎంఏ ఎకనామిక్స్‌లో నిర్వహించిన పరీక్షలో 62 మార్కులు సాధించి రాష్ట్రవ్యాప్తంగా 53వ ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు. అందుకు గాను కళాశాల అధ్యాపక బృందం మంజులను మెమోంటోతో ఘనంగా అభినందించారు. భవిష్యత్తులో కూడా మరిన్ని విజయా లు సాధించాలని అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చక్రపాణి రెడ్డి, ప్రోగ్రాం ఆఫీ సర్ షకిల్ అహ్మద్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాసులు, అంజలి, గిరిధర్, సురేష్ లు పాల్గొన్నారు.

## ప్రతిభకు పురస్కారాలు

వనపర్తి రూరల్, ఆగస్టు 15: కలెక్టర్ కార్యాలయంలో 78వ భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రీతం జెండా ఎగరవేశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు అవార్డు అందజేశారు.



కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, ప్రీతం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్



అడిషనల్ ఎస్పీ రాందాస్



డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీబాయి



డీఎంహెచ్‌వో జయచంద్ర మోహన్



జడ్పీ సీఈవో యాదయ్య



డీపీఆర్వో సీతారాం



ఆఫీసర్ భాను ప్రకాష్



తహసీల్దార్ యాదగిరి




రూరల్ ఎస్ఐ జలంధర్ రెడ్డి



వనపర్తి రూరల్ ఎస్ఐ బాలయ్య



ఆత్మకూరు ఏఎస్ఐ బీచుపల్లి



పంచాయతీ రాజ్ ఈఈ మల్లయ్య



ఖిల్లాఘణపురం పీఎస్ సత్యనారాయణ



వనపర్తి రూరల్ పీఎస్ సుగుణమ్మ



వనపర్తి పీఎస్ కృష్ణసాగర్



పెబ్బేరు పీఎస్ కరుణాకర్ గౌడ్



ప్రిన్సిపాల్ భాస్కర్



బ్యాంక్ మేనేజర్ శేఖర్ రెడ్డి



ఐసీఐసీఐ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్



యూపీఐ బ్యాంకు మేనేజర్ శివశంకర్



ఎంపీపీ నరేష్



అవార్డు అందుకుంటున్న అడిషనల్ కలెక్టర్ నగేష్